ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్



పోలింగ్ పరిశీలిస్తున్న ఆర్‌ఓ కొమరయ్య

లంగర్‌హౌస్: పోలీసుల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రశాంతంగా ముగిసింది. కార్వాన్ నియోజకవర్గంలోని వివిధ పోలీస్‌స్టేషన్ల అధికారులు, సిబ్బంది లంగర్‌హౌస్‌లో రిటర్నింగ్ అధికారి కొమరయ్య సమక్షంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో పోలీసు అధికారులు, సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 411 ఓట్లు ఉండగా 70 శాతం మంది ఓటింగ్‌లో పాల్గొన్నట్లు అధికారులు తెలిపారు.

సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన సీపీ



సంతోష్‌నగర్: ఎన్నికల సందర్భంగా ప్రతి ఒక్కరూ పోలీసులకు పూర్తిగా సహకరించాలని నగర పోలీసు కమిషనర్ సందీప్ శాండిల్య అన్నారు. బుధవారం సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి ఎన్నికల బందోబస్తుపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా పోలీస్‌స్టేషన్ల పరిధిలో తీసుకుంటున్న చర్యలు, బందోబస్తు, అదనపు బలగాలు తదితర విషయాలపై ఆరా తీయడం జరిగిందన్నారు. ప్రస్తుతం అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో వాహనాల తనిఖీలు కొనసాగుతున్నాయని.. ఇక ముందు కూడా కొనసాగుతాయన్నారు. సంతోష్‌నగర్ ఏసీపీ మహ్మద్ గౌస్, ఇన్‌స్పెక్టర్ శివచంద్ర తదితరులు పాల్గొన్నారు.

నగరంలో అసోం సీఎం ప్రచారం

గౌలిపురా: అసోం సీఎం హేమంత్ బిశ్వా శర్మ బుధవారం నగరంలో ప్రచారం నిర్వహించారు. బేలా చౌరస్తాలో జరిగిన గోల్కొండ–భాగ్యనగర్ సకల జనుల విజయ సంకల్ప సభలో ఆయన పాల్గొన్నారు. దేశంలో ఎక్కడ ముస్లింలకు రిజర్వేషన్లు లేవని... కేవలం తెలంగాణలోనే రిజర్వేషన్లు అమలు జరుగుతున్నాయన్నారు. తాము అధికారంలోకి వచ్చిన అనంతరం ముస్లిం మైనార్టీల రిజర్వేషన్లను రద్దు చేసి ఎస్సీ, ఓబీసీ రిజర్వేషన్లను పెంచుతామన్నారు. బహదూర్‌పురా, చాంద్రాయణగుట్ట, చార్మినార్ బీజేపీ అభ్యర్థులు వై.నరేశ్, కౌడి మహేందర్, మేఘారాణి, గౌలిపురా కార్పొరేటర్ భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల ఏర్పాట్లకు ప్రాధాన్యం



ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని సన్మానించిన స్థానికులు

విజయనగర్‌కాలనీ: మౌలిక సదుపాయాల ఏర్పాట్లకు ఎంఐఎం పార్టీ ప్రాధాన్యమిస్తుందని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. బుధవారం మాసబ్‌ట్యాంక్, చింతల బస్తీ, వీర్‌నగర్, సైఫాబాద్ తదితర ప్రాంతాల్లో నాంపల్లి ఎంఐఎం అభ్యర్థి మాజీద్ హుస్సేన్‌తో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కులమతాలకు అతీతంగా ఎంఐఎం పార్టీ బస్తీలు, కాలనీల్లో అభివృద్ధి పనులు చేపడుతుందన్నారు. మాజీద్ హుస్సేన్‌ను గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. గత రెండు దశాబ్దాల నుంచి ఎంఐఎం పార్టీ నాంపల్లి నియోజకవర్గంలో ప్రజాసేవకే అంకితమైందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే బీజేపీకి వేసినట్లేనన్నారు. నాంపల్లి నియోజకవర్గంలో ఇప్పటికే గత ఎమ్మెల్యే జాఫర్‌హుస్సేన్ మేరాజ్ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పూర్తిచేశారని, ఇంకా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలంటే ఎంఐఎం పార్టీకే సాధ్యపడుతుందని వివరించారు. ఏరియా ప్రెసిడెంట్ అహ్మద్ మాజీద్ రజ్వీ, మహ్మద్ అతిక్, మహ్మద్ మాజీద్ భాయ్, అశ్వాక్ అహ్మద్, మహ్మద్ మహమూద్, మహ్మద్ జంషీద్ పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ 2023

బీజేపీ హయాంలోనే గోషామహల్ అభివృద్ధి



బేగంబజార్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో బీజేపీ హయాంలోనే కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు చేశానని బీజేపీ అభ్యర్థి ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. కేవలం బీఆర్ఎస్ అసత్య ప్రచారాలకు పాల్పడుతుందని ఆయన ఆరోపించారు. బేగంబజార్ పరిసర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం చేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం రాజాసింగ్ మాట్లాడుతూ.. మరోసారి తనను గెలిపిస్తే ప్రజలకు అహర్నిశలు అభివృద్ధి చేసి వారి సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. ఎన్నికలు ఉన్నా, లేకున్నా తానే ప్రజల మధ్యలో ఉండి అభివృద్ధి చేస్తున్నట్లు రాజాసింగ్ వివరించారు. బీజేపీ నాయకులు కార్పొరేటర్ లాల్‌సింగ్, కిసాన్‌మోర్చా గోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కా కృష్ణాగుప్తా తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ అంటే భరోసా'



ప్రచారం చేస్తున్న అమర్‌సింగ్

గోల్కొండ/లంగర్‌హౌస్: బీజేపీ అంటే భరోసాకు మారుపేరని ఆ పార్టీ కార్వాన్ అభ్యర్థి టి.అమర్‌సింగ్ అన్నారు. బుధవారం ఆయన కార్వాన్, గుడిమల్కాపూర్‌లలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాదయాత్ర చేసి ఓటర్లను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్వాన్ నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందని మజ్లిస్ ఎమ్మెల్యేలు కార్వాన్ నియోజకవర్గానికి చేసిందేమి లేదని ఆయన ఆరోపించారు. అనంతరం అక్కడి నుంచి వందల సంఖ్యల కార్యకర్తలతో లంగర్‌హౌస్ వీధుల్లో పాదయాత్ర నిర్వహించి ప్రచారం చేశారు. సునీల్‌యాదవ్, శ్రీనివాస్, ఇంద్రసేనారెడ్డి, నాగేంద్రప్రకాష్‌రెడ్డి, చెరుకుల సంతోష్ పాల్గొన్నారు.

శాస్త్రీయ సంగీత కళలను పరిరక్షించుకోవాలి



కుమార్‌ను సన్మానిస్తున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు తదితరులు

గన్‌ఫౌండ్రీ: శాస్త్రీయ సంగీత కళలను పరిరక్షించుకోవాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో నట్రాజ్ అకాడమీ, మనం ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో మానవ సేవయే నా ధ్యేయం శీర్షికన పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురికి ఉత్తమ సేవా రత్న, విద్యారత్న పురస్కారాలను ప్రదానం చేశారు. అంతకు ముందు పలువురు నృత్య గురువులను ఘనంగా సన్మానించగా చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అదేవిధంగా ప్రముఖ సామాజిక వేత్త లక్ష్మీరామ్మోహన్‌రావు దంపతులకు స్వర్ణ కంకణాన్ని ప్రదానం చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం యూజీసీ ఎఫైర్స్ డీన్ గడ్డం మల్లేష్, సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ, మనం ఫౌండేషన్ అధ్యక్షులు ఆర్ఎస్.కుమార్, నట్రాజ్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు నల్లా గిరి పాల్గొన్నారు.

చార్మినార్‌లో కాంగ్రెస్ ప్రచారం



చార్మినార్: ఈ ఎన్నికల్లో చార్మినార్ నుంచి తనను గెలిపిస్తే.. నియోజక వర్గంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తానని చార్మినార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ ముజీబుల్లా షరీఫ్ అన్నారు. ప్రచారంలో భాగంగా ఆయన తన అనుచరులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నియోజకవర్గంలోని పలు బస్తీల్లో పాదయాత్ర నిర్వహించి కరపత్రాలను పంచిపెట్టారు. ఏళ్ల తరబడి చార్మినార్ ప్రజలకు కనీస సౌకర్యాలు కరువయ్యాయన్నారు.

కార్వాన్‌లో బీఆర్ఎస్‌దే విజయం



కార్యకర్తలను సన్మానిస్తున్న మిత్ర కృష్ణ

జియాగూడ: కార్వాన్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌దే విజయమని ఆ పార్టీ అభ్యర్థి మిత్రకృష్ణ అన్నారు. బుధవారం జియాగూడలోని దుర్గానగర్‌లో గల పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం ఏర్పాటైంది. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ బీఆర్ఎస్, ఎంఐఎం మధ్య పోటీ ఉంటుందని ఆయన తెలిపారు. కేసీఆర్ సంక్షేమ పథకాలు అన్నివర్గాలకు లభించడంతో ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్‌కు ఓటు వేయడానికి సుముఖత వ్యక్తం చేస్తున్నారన్నారు. వెంకటేష్, నరహరిచారి, కిశోర్‌కుమార్, నర్సింహ, రఘునాథ్ పాల్గొన్నారు.

దుప్కి పున్నమి జాతరకు తరలిరండి



లంగర్‌హౌస్: త్రివేణి సంగం దుప్కి పున్నమి జాతరలో భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని త్రివేణి సంగం రాంచంద్ర జీ మఠం పీఠాధిపతి రాహుల్ దాస్ బాబా బుధవారం కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ..ఈ నెల 24 నుండి కార్తీక ముక్తి స్నానాల జాతర ప్రారంభం అవుతుందన్నారు. ఇందులో భాగంగా 24న సాయంత్రం తులసీ నారాయణుల వావాహం, జ్వాలా తోరణంతో పాటు 27న తెల్లవారుజామున 2 గంటలకు స్వామి వారికి నదీ స్నానం, రథోత్సవంతో ముక్తి స్నానాలు ప్రారంభం కానున్నాయన్నారు.

కాంగ్రెస్‌ను ఆదరించాలి

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బోయ నగేష్ బుధవారం స్థానికంగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరిస్తూ మద్దతు తెలపాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహాలక్ష్మీ, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, యువ వికాసం, చేయూత, బీసీ, మైనార్టీ డిక్లరేషన్లతో అందరికీ న్యాయం జరుగుతుందన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న బోయ నగేష్

బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం



రెడ్‌హిల్స్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ మహిళా నేతలు

నాంపల్లి: బీఆర్ఎస్ అభ్యర్థి సీహెచ్ ఆనంద్‌కుమార్‌గౌడ్‌కు మద్దతుగా ఆ పార్టీ మహిళా నేతలు బుధవారం రెడ్‌హిల్స్‌లో ప్రచారం చేశారు. ఇంటింటికి తిరుగుతూ మహిళలకు బొట్టు పెట్టి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. డివిజన్‌లోని హాజీమ్ టవర్స్, విష్ణునగర్ ప్రాంతాల్లో పాదయాత్ర చేసి పార్టీకి చెందిన కరపత్రాలను పంపిణీ చేశారు.

బీజేపీకి ప్రజలు గుణపాఠం చెప్పాలి



ప్రచారం చేస్తున్న చలపతిరావు, ఆనంద్‌కుమార్‌గౌడ్, ఆశీష్‌కుమార్ యాదవ్

అబిడ్స్: మతాల మధ్య విద్వేషాలు సృష్టిస్తూ ఓట్లు అడిగే బీజేపీకి ప్రజలు గుణపాఠం చెప్పాలని రాష్ట్ర బీఆర్ఎస్ కార్మిక విభాగం ఈఎస్ఐ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.చలపతిరావు, బీఆర్ఎస్ నాయకులు ఆనంద్‌కుమార్‌గౌడ్, ఆశీష్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం గోషామహల్ పరిసర ప్రాంతాల్లో వారు ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ...బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ పదేళ్లల్లో ఏ ఒక్కరోజు కూడా ప్రజా సమస్యలు పరిష్కరించలేదన్నారు. దేశ పర్యటనలు చేస్తూ గోషామహల్ అభివృద్ధిని రాజాసింగ్ మంటగలిపారని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో బీజేపీని చిత్తుగా ఓడించి ప్రజలకు మెరుగైన అభివృద్ధిని అందించే బీఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్‌తో పాటు నరేందర్‌యాదవ్, వినోద్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు పేదలకు వరం



ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి మిత్ర కృష్ణ

గోల్కొండ: బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు పేదలకు వరంలాంటివని కార్వాన్ బీఆర్ఎస్ అభ్యర్థి మిత్ర కృష్ణ అన్నారు. బుధవారం ఆయన నియోజకవర్గ పరిధిలో విస్తృతంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సమక్షంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలులో తెలంగాణకు మరే రాష్ట్రం సాటిరాదన్నారు. మరో వైపు తెలంగాణలో కొత్త కొత్త పరిశ్రమలు పెట్టడానికి విదేశీ పెట్టుబడిదారులు ముందుకు వచ్చి పరిశ్రమలు స్థాపించారని ఆయన అన్నారు. దీన్ని వల్ల యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా పెరిగాయని ఆయన అన్నారు. మూడవసారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రానుందని ఆయన పేర్కొన్నారు.

అబద్ధాల బీజేపీని ప్రజలు నమ్మరు



గంగాబౌలీలో ప్రచారం చేస్తున్న దామోదర్‌గుప్తా, నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: ప్రజలకు అబద్ధాలు చెబుతూ ఓట్లు దండుకునే బీజేపీని ప్రజలు నమ్మేస్థితిలో లేరని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా పేర్కొన్నారు. బీజేపీ అంటేనే భారత్ జూటా పార్టీ అని ఆయన అన్నారు. బుధవారం మంగళ్‌హాట్ పరిధిలోని గంగాబౌలి పరిసర ప్రాంతాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్‌వ్యాస్ బిలాల్‌తో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం దామోదర్ గుప్తా మాట్లాడుతూ.. పదేళ్లుగా గోషామహల్ అభివృద్ధిని విస్మరించిన ఎమ్మెల్యే రాజాసింగ్‌ను ప్రజలు చిత్తుగా ఓడిస్తారన్నారు. నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ..25 ఏళ్లుగా ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న తనను గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీ సింగ్, బీఆర్ఎస్ నాయకులు ఆనంద్‌సింగ్, శ్రీనివాస్‌యాదవ్, ఆంజనేయులు, నవనీత, బల్‌వీర్‌సింగ్ పాల్గొన్నారు.



వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న రాంరెడ్డి

కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంను చేయాలి

చాంద్రాయణగుట్ట: రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ చేస్తున్న కేసీఆర్ నాయకత్వానికి మరోసారి పట్టం కట్టాలని బీఆర్ఎస్ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం అభ్యర్థి ముప్పిడి సీతారాంరెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని రవీంద్ర నాయక్‌నగర్‌లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాటాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ నాయకుల జిమ్మిక్కులను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగింపు కావాలంటే బీఆర్ఎస్ అధికారంలోకి రావాలన్నారు. ముచ్చటగా మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా



ప్రచారం చేస్తున్న రవిరాజ్ తదితరులు

గౌలిపురా: ఈసారి తనకు అవకాశం కల్పించి తనను ఆశీర్వదించి గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ యాకుత్‌పురా నియోజకవర్గం అభ్యర్థి కె.రవిరాజ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం వివేకనంద నగర్, హనుమాన్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఆయన నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరిస్తూ చేతిగుర్తుకు ఓటు వేసి తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. మామిడి కృష్ణ కుమార్, అల్లం రాకేశ్, మామిడాల శ్రీనివాస్, డీసీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్వాన్‌ను మరింత అభివృద్ధి చేసుకుందాం



ప్రచారంలో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్

లంగర్‌హౌస్/గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేస్తున్నామని, మరోసారి ఎంఐఎంకు పట్టం కట్టి మన ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ అన్నారు. లంగర్‌హౌస్ మందుల బస్తీ తదితర ప్రాంతాల్లో బుధవారం నాయకురాలు మత్స రేణుక ఆధ్వర్యంలో పాదయాత్ర చేసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌసర్ మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గంలో ప్రతి బస్తీలో సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ ప్రచారంలో నాయకులు శివశంకర్, సునంద పాల్గొన్నారు.

కార్వాన్‌లో హ్యాట్రిక్ సాధిస్తా..

జియాగూడ: కార్వాన్‌లో హ్యాట్రిక్ సాధిస్తానని ఎంఐఎం అభ్యర్థి కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. బుధవారం సబ్జిమండి, ముస్తయిద్‌పురా, ఉప్పరబస్తీ తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ఓటు వేయాల్సిందిగా కోరారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

అబిడ్స్: బీజేపీతోనే గోషామహల్‌లో అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర బీజేపీ నాయకుడు ఎం.విక్రమ్ గౌడ్ పేర్కొన్నారు. దారుసలాం, సేవక్‌నగర్, భరత్‌నగర్, ఓంనగర్ ప్రాంతాల్లో ఆయన పర్యటించి బీజేపీ అభ్యర్థి రాజాసింగ్‌ను గెలిపించాలని ప్రచారం చేశారు. బీఆర్ఎస్ ఎన్ని కుట్రలు చేసినా రాజాసింగ్‌దే విజయమని ఆయన అన్నారు. కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్, జగపతి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



దారుసలాం ప్రాంతంలో ప్రచారం చేస్తున్న విక్రమ్‌గౌడ్

గోషామహల్‌లో కాంగ్రెస్ ప్రచారం



ఫీల్‌ఖానాలో ప్రచారం చేస్తున్న సునీతారావు

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీదే విజయమని కాంగ్రెస్ అభ్యర్థి మొగిలి సునీతా రావు పేర్కొన్నారు. బేగంబజార్, ఫీల్‌ఖానా ప్రాంతాల్లో ఆమె ముమ్మరంగా ప్రచారం చేశారు. అనంతరం మొగిలి సునీతారావు మాట్లాడుతూ..కాంగ్రెస్‌తోనే పేద బడుగువర్గాల సంక్షేమం జరుగుతుందన్నారు. అన్నివర్గాల ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరిస్తున్నారన్నారు. పదేళ్లుగా ఎలాంటి అభివృద్ధి చేయని ఎమ్మెల్యే రాజాసింగ్‌ను చిత్తుగా ఓడించి విజయం సాధిస్తానన్నారు.

చార్మినార్‌లో విజయం మాదే



చార్మినార్: అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్నందున ఈ ఎన్నికల్లో మా పార్టీ విజయం ఖాయమని చార్మినార్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ సలావుద్దీన్ లోధీ ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన పార్టీ కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంచిపెడుతూ సీఎం కేసీఆర్ ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రి అవుతారన్నారు. ఈ ఎన్నికలలో తనను గెలిపిస్తే, ఆశించిన ఫలితాలు సాధిస్తామన్నారు.

'బీజేపీ అఖండ విజయం సాధిస్తుంది'



మోదీ ఫేస్ మాస్కులను ధరించిన చిన్నారులతో అభ్యర్థి అమర్‌సింగ్

జియాగూడ: కార్వాన్ నియోజకవర్గంలో బీజేపీ అఖండ విజయం సాధిస్తుందని ఆ పార్టీ అభ్యర్థి అమర్‌సింగ్ అన్నారు. బుధవారం పటేల్ హోటల్, నవోదయ గంగానగర్, బాంజావాడి, కుమ్మరి బస్తీ తదితర ప్రాంతాల్లో ఓటు వేయాల్సిందిగా పాదయాత్ర చేసి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్వాన్‌లో బీజేపీ పూర్వ వైభవాన్ని సంతరించుకుందని గెలుపు ఖాయమని ఆయన పేర్కొన్నారు. సునీల్‌యాదవ్, డిజ్వర్ సింగ్, శివకుమార్ యాదవ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

'సుస్థిర పాలన అందించే సత్తా కాంగ్రెస్‌కే ఉంది'



మాట్లాడుతున్న కార్వాన్ అభ్యర్థి ఉస్మాన్ బిన్ మహ్మద్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గానికి మజ్లిస్ ఎమ్మెల్యే చేసింది శూన్యం అని కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్ హాజీరి అన్నారు. బుధవారం ఆయన గోల్కొండ మోతీదర్వాజ చౌరస్తా వద్ద జరిగిన కాంగ్రెస్ ఎన్నికల సభలో మాట్లాడారు. ఆయన మజ్లిస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలపై మండిపడ్డారు. బీజేపీ ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు పరిచే పార్టీ అని ప్రజలు మధ్య చిచ్చుపెడుతున్న ఆ పార్టీకి ఓటు అడిగే హక్కు లేదని ఆయన అన్నారు. సంక్షేమ పథకాల పేరుతో వేల కోట్ల రూపాయలు తమ ఖాతాల్లోకి బీఆర్ఎస్ నాయకులు మళ్లించుకున్నారని ఆయన ఆరోపించారు. సుస్థిర పాలన అందించే సత్తా కాంగ్రెస్ పార్టీకే ఉందని ఆయన అన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు అమ్జత్‌ఖాన్, అబ్దుల్లా తదితరులున్నారు.

భవనం పైనుంచి కంకర రాళ్లుపడి వ్యక్తికి గాయాలు

నాంపల్లి: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తిపై నిర్మాణంలో ఉన్న ఐదవ అంతస్తు పై నుంచి కంకర రాళ్లు పడి గాయాలు అయ్యాయి. ఈ ఘటన హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..బజార్‌ఘాట్‌కు చెందిన సర్వర్ (49) ఫర్నిచర్ దుకాణంలో పనిచేస్తాడు. బుధవారం సాయంత్రం నాంపల్లి ఏరియా ఆస్పత్రి మీదుగా తన ద్విచక్రవాహనంపై దుకాణానికి వెళ్తుండగా నిర్మాణంలో ఉన్న ఐదవ అంతస్తుపై నుంచి కంకర రాళ్లు పడ్డాయి. దీంతో అతడికి ముఖం, ముక్కుకు గాయాలయ్యాయి. బాధితుడు హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి: సామ సుందర్‌రెడ్డి



సామ సుందర్ రెడ్డికి హారతి పడుతున్న మహిళలు

గౌలిపురా: ప్రభుత్వ సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని యాకుత్‌పురా నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి సామ సుందర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం గౌలిపురా డివిజన్‌లోని అచ్చయ్యనగర్, ఛత్రినాక, హనుమాన్‌నగర్ ఫేజ్–1,2,3, అంబికానగర్, పటేల్‌నగర్, సర్దార్ పటేల్‌నగర్, మేకల మండి, ఎస్సార్టీ కాలనీ, శ్రీరాంనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఆయన నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారాన్ని నిర్వహిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం పదేళ్లుగా అన్ని వర్గాల ప్రజలకు పలు సంక్షేమ పథకాలను అందజేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐ.ఎస్.సదన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్న సుందర్‌రెడ్డి, సరిత సాయిబాబా, సీఎం.ప్రవీణ్ రాజు, శివకుమార్, సంతోష్‌కుమార్, ఆనంద్, మహేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి



ప్రచారం చేస్తున్న కాశమోనీ శ్యాంరావు

చార్మినార్: బహదూర్‌పురా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పులిపాటి రాజేశ్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ గ్రేటర్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోనీ శ్యాంరావు ముదిరాజ్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించి కరపత్రాలు పంచిపెట్టారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాల హామీ పట్ల అన్ని వర్గాల ప్రజలు ఆకర్షితులవుతున్నారన్నారు.

మజ్లిస్‌తో పాతబస్తీ అభివృద్ధి



బహదూర్‌పురా: మజ్లిస్ పార్టీతో పాతబస్తీ అభివృద్ధి సాధ్యమని బహదూర్‌పురా నియోజకవర్గం మజ్లిస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ మోబీన్ అన్నారు. బుధవారం రామ్నాస్‌పురా డివిజన్‌లో ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. తనను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని..బహదూర్‌పురా నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు.

అక్బరుద్దీన్ ఒవైసీపై చర్యలు తీసుకోవాలి



కౌడి మహేందర్

చార్మినార్: విధుల్లో ఉన్న పోలీసు అధికారిపై దురుసుగా ప్రవర్తించిన అక్బరుద్దీన్ ఒవైసీపై చర్యలు తీసుకోవాలని బీజేపీ చాంద్రాయణగుట్ట అభ్యర్థి కౌడి మహేందర్ డిమాండ్ చేశారు. సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఐతో కలిసి మోయినాబాగ్‌లో జరుగుతున్న బహిరంగ సభకు వెళ్లి పది గంటలు కావస్తోంది.. సభ ముగించే ప్రయత్నం చేయండి అని చెప్పడంతో వారిపై అక్బరుద్దీన్ ప్రజలందరి సమక్షంలో మండిపడడం సరైంది కాదన్నారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా తమకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన నగర పోలీసు కమిషనర్‌ను కోరారు.

బీసీలు బీజేపీకి మద్దతు ఇవ్వాలని అడిగే హక్కు మంద కృష్ణకు లేదు

సుల్తాన్‌బజార్: బీసీ వర్గాలు బీజేపీకి మద్దతు ఇవ్వాలని అడిగే నైతిక హక్కు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగకు లేదని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ అన్నారు. మందకృష్ణ మాదిగ బీసీల వ్యతిరేకి అని ఆయన ఆరోపించారు. బుధవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై ప్రధాని మోదీ కమిటీ వేస్తే తమకు అభ్యంతరం లేదని, కానీ మంద కృష్ణ మాదిగ బీసీలు, రెడ్డిలు, వెలమలకు ఊడీగం చేస్తున్నారని వ్యాఖ్యలు చేయడంపై తీవ్ర ఆక్షేపణ వ్యక్తం చేశారు. పలు ప్రజా సంఘాల నేతలు ప్రభంజన్‌యాదవ్, ఆంజనేయులు, బత్తుల సిద్దేశ్వర్లు, నరహరి, జి.భిక్షపతి గౌడ్, కటస్వామి పాల్గొన్నారు.

నిజాం కళాశాల విద్యార్థుల ఆందోళన

గన్‌ఫౌండ్రీ: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిజాం కళాశాల విద్యార్థినులు రోడ్డెక్కారు. నెల రోజులుగా బాలికల వసతి గృహంలో నీళ్ల రావడం లేదని ప్రిన్సిపల్‌కు చెప్పినా పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ బుధవారం కళాశాల వసతి గృహం ముందు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. పలువురు విద్యార్థినులు మాట్లాడుతూ.. నెల రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కళాశాల సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యను తక్షణమే పరిష్కరించాలని లేని యెడలా పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. విద్యార్థినీలు రోడ్డుపై బైఠాయించడంతో బషీర్‌బాగ్, హైదర్‌గూడ, లిబర్టీ ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఆందోళన చేస్తున్న విద్యార్థులను అబిడ్స్ పోలీసులు అరెస్టు చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

మజ్లిస్ పార్టీకి భారీ మెజార్టీ ఖాయం



చార్మినార్: బహదూర్‌పురా నుంచి పోటీ చేస్తున్న మహ్మద్ ముబీన్ భారీ మెజార్టీతో విజయం సాధించనున్నారని సీనియర్ మజ్లిస్ పార్టీ నాయకులు ఆర్.రాజేశ్వర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. మహ్మద్ ముబీన్‌తో కలిసి ఆయన దూద్‌బౌలీ తదితర బస్తీల్లో జరిగిన ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు వారిని సత్కరించారు. బహదూర్‌పురా నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఇక్కడ మజ్లిస్ పార్టీ జెండా మాత్రమే ఎగురుతుందన్నారు. ఈసారి జరిగే ఎన్నికల్లో ఆయనకు భారీ విజయం ఖాయమన్నారు.